


రూ.32 కోట్ల పన్ను బకాయి

● మంత్రిమాల్‌కు తాళం

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రముఖ మాల్స్‌లో ఒకటైన మంత్రిమాల్ సుమారు రూ.32కోట్ల మేర పన్ను బకాయి ఉన్న మేరకు బీబీఎంపీ అధికారులు మాల్‌కు తాళం వేశారు. పన్ను బకాయిలకు సంబంధించి పలుమార్లు నోటీసు ఇచ్చినా స్పందన లేకపోవడంతో శనివారం అధికారులు మాల్‌ను సందర్శించి పోలీసులు, మార్షల్స్ సహకారంతో తాళం వేశారు. మాల్ మెయిన్‌గేట్‌కు నోటీసు అతికించారు.

మోగిన నగారా





● రాష్ట్రంలో రెండు దశల్లో లోక్‌సభ ఎన్నికలు

● ఏప్రిల్ 26, మే 7న పోలింగ్ ● ఒక్కోసారి 14 నియోజకవర్గాల్లో నిర్వహణ

● 5,42,08,088 మంది ఓటర్లు ● 58,834 పోలింగ్ కేంద్రాలు

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నగారా శనివారం మోగింది. రాష్ట్రంలోని మొత్తం 28 నియోజకవర్గాలకు రెండు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. తొలి దశ పోలింగ్ ఏప్రిల్ 26న, రెండో దశ పోలింగ్ మే 7న నిర్వహిస్తారు. ఫలితాల కోసం జూన్ 4వరకు ఎదురుచూడాల్సి ఉంటుంది. కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాష్ట్రంలోని ఉడుపి - చిక్కమగళూరు, హాసన్, దక్షిణకన్నడ, చిత్రదుర్గ, తుమకూరు, మండ్య, మైసూరు, చామరాజనగర, బెంగళూరు గ్రామీణ, బెంగళూరు ఉత్తర, బెంగళూరు సెంట్రల్, బెంగళూరు దక్షిణ, చిక్కబళ్లాపుర, కోలారు నియోజకవర్గాల్లో ఏప్రిల్ 26న తొలివిడత పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్‌ను ఈనెల 28న విడుదల చేయనున్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏప్రిల్ 4 చివరితేదీగా ఉంటుంది. మరుసటి రోజు నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 8వరకు గడువు ఉంటుంది. పోలింగ్ 26న నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపును జూన్ 4న చేపడతారు. మిగిలిన 14 నియోజకవర్గాలు చిక్కోడి, బెళగావి, బాగల్కోటె, బిజాపూర్, కలబురగి, రాయచూరు, బీదర్, కొప్పళ, బళ్లారి, హావేరి, ధారవాడ, ఉత్తరకన్నడ, దావణగెరె, శివమొగ్గలో మే 7న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఏప్రిల్ 12న జారీ కానుంది. నామినేషన్లు సమర్పించేందుకు ఏప్రిల్ 19 చివరితేదీగా ఉంటుంది. మరుసటి రోజు వీటిని పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 22వరకు గడువు ఉంటుంది. మే 7న పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు జూన్ 4న చేపడతారు.

5.42 కోట్ల మంది ఓటర్లు

రాష్ట్రంలోని మొత్తం 28 లోక్‌సభ నియోజకవర్గాలలో కలిపి 5,42,08,088 మంది ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఓటు హక్కు వినియోగించుకోనున్నవారిలో 2,71,21,407 మంది పురుషులు, 2,70,81,748 మంది మహిళలు ఉన్నారు. థర్డ్ జెండర్‌కు చెందిన ఓటర్లు 4,933 మంది ఉన్నారు. వీరుకాక సర్వీస్ ఓటర్ల సంఖ్య 46,412గాను, ఎన్నికల డ్యూటీలో పాల్గొనే ఓటర్ల సంఖ్య 3,200గాను ఉంది. 18-19 ఏళ్ల ప్రాయం కల్గిన యువ ఓటర్ల సంఖ్య 11,24,622 కాగా, 85 ఏళ్ల పైబడిన ఓటర్ల సంఖ్య 5,70,168గా ఉంది.



బెంగళూరు ఉత్తరలో అత్యధికం..

బెంగళూరు ఉత్తర నియోజకవర్గంలో అత్యధికంగా 31,74,098 మంది ఓటర్లు ఉండగా అతి తక్కువగా ఉడుపి-చిక్కమగళూరు నియోజకవర్గంలో 15,72,958 మంది ఉన్నారు.




58,834 పోలింగ్ కేంద్రాలు

లోక్‌సభ ఎన్నికలకోసం ఈసారి 58,834 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇందులో 21,682 పోలింగ్ కేంద్రాలు నగరాలు, పట్టణ ప్రాంతాల్లోనూ, 37,152 పోలింగ్ కేంద్రాలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు. బెంగళూరు ఉత్తర లోక్‌సభ నియోజకవర్గంలో అత్యధికంగా 2,911 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా ఉడుపి-చిక్కమగళూరు నియోజకవర్గంలో 1842 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 3,51,153 మంది సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నారు. వీరిలో 28 మంది రిటర్నింగ్ అధికారులు, 290 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఉంటారని ఎన్నికల సంఘం తెలిపింది. మొత్తం 58,834 ఈవీఎంలను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. ఒకవేళ ఏదైనా మొరాయిస్తే అత్యవసరంగా మరికొన్నింటిని అందుబాటులో ఉంచుతామన్నారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ మీనా



ఇఫ్తార్	: ఆదివారం సాయంత్రం 06:31
సెహరి	: సోమవారం ఉదయం 05:11

సురపుర శాసనసభ నియోజకవర్గానికి మే 7న ఉప ఎన్నిక



బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజావెంకటప్ప నాయక్ అకస్మిక మృతి కారణంగా ఖాళీ ఏర్పడ్డ సురపుర శాసనసభ నియోజకవర్గానికి మే 7న ఉప ఎన్నిక జరగనుండగా ఫలితాలు జూన్ 4న ప్రకటించనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ కారణాలతో ఖాళీ అయిన 26 శాసనసభ నియోజకవర్గాలకు కూడా లోక్‌సభ ఎన్నికలతోపాటు పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈమేరకు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ మీనా శనివారం మీడియాకు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,81,439 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ కోసం మొత్తం 317 పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అసంతృప్త నేతలను బుజ్జగిస్తున్న బీజేపీ

● రంగంలోకి దిగిన యడియూరప్ప, బసవరాజ్ బొమ్మై

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు టిక్కెట్లు ఆశించి భంగపడ్డ అసంతృప్త నేతలను బుజ్జగించేపనిలో అధిష్ఠానం పెద్దలు నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో ఈసారి జేడీఎస్‌తో కలసి మొత్తం 28 నియోజకవర్గాల్లోనూ విజయఢంకా మోగించాలని గట్టిపట్టుతో ఉన్న అధిష్ఠానం పెద్దలు పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతను మాజీ ముఖ్యమంత్రులు యడియూరప్ప, బసవరాజ్ బొమ్మైకు అప్పగించినట్టు తెలుస్తోంది. ప్రత్యేకించి హావేరి అభ్యర్థిగా ఉన్న మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, తుమకూరు బీజేపీ అభ్యర్థి సోమణ్ణకు అసంతృప్తి సెగలు ఒకింత తీవ్రంగానే ఉన్నాయి. తుమకూరు జిల్లా మాజీ మంత్రి బీజేపీ సీనియర్ నేత మాధుస్వామి అయితే ఏకంగా సోమణ్ణను తన ఇంటికి రావద్దంటూ ఒకింత కఠోరంగా చెప్పడం, శివమొగ్గలో ఇండిపెండెంట్‌గా బరిలో కి దిగుతానని సీనియర్ నేత కేఎస్ ఈశ్వరప్ప ప్రకటించడం, బెళగావిలో బయట వ్యక్తిని ఎందుకు అంటగడతున్నారం టూ స్థానిక బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయడం, కొప్పళ టిక్కెట్ దక్కకపోవడంతో సిట్టింగ్ ఎంపీ సంగణ్ణ బోరున విలపించడం వంటి పరిణామాలతో అధిష్ఠానం పెద్దలు అప్రమత్తమయ్యారు. కాగా హావేరిలో ఈశ్వరప్ప కుమారుడు కాంతేశ్‌కు టిక్కెట్ ఇవ్వాల్సిందిగా అధిష్ఠానం పెద్దలను కలిసేందుకు ఢిల్లీ వెళ్తున్నట్టు బీజేపీ నేత రమేశ్‌జార్కిహొళి ప్రకటించారు. హావేరి అభ్యర్థి పేరు చివరిక్షణంలో మారే అవకాశం ఉందని ఆయన సూచనప్రాయంగా చెప్పారు. అసంతృప్త నేతలను బుజ్జగిస్తున్నామని, వారి సేవలను పార్టీ తప్పకుండా వేరే రూపంలో వినియోగించుకుంటుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర శనివారం కలబురగిలో మీడియాకు చెప్పారు.



పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళి

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది తెలుగు ప్రజలకు స్ఫూర్తి దాయకంగా ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నగరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కర్ణాటక రాష్ట్ర పొట్టి శ్రీరాములు తెలుగు సంఘం ఆధ్వర్యంలో జిగణి కార్యాలయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు తెలుగు రాష్ట్రం కోసం తన ప్రాణాలనే అర్పించిన పొట్టిశ్రీరాములును తెలుగు ప్రభుత్వాలు మర్చిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదే సందర్భంగా తెలుగు ప్రముఖులు బి.వెంకట్రామ్‌రెడ్డి, పి.లక్ష్మీరంగారెడ్డి, పాణ్యం బాషాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా పొట్టిశ్రీరాములు తెలుగు సంఘం అధ్యక్షుడు బి.వెంకట్రామ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వీరనారాయణ, పిజి సంఘం అధ్యక్షుడు పి.లక్ష్మీరంగారెడ్డి, కోశాధికారి కాశీంపీరా హాజరయ్యారు. సంఘం సభ్యులు ఎస్.రమేష్, నాగులు, రఘునాథరెడ్డి, కె.మదన్‌రెడ్డి, వినోద్ కుమార్ రెడ్డి, పి.వెంకటసుబ్బారెడ్డి, ఎస్ మల్లికార్జున్ పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తూ



ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు నివేదిక అందజేస్తున్న వేతన సంఘం సభ్యులు

సీఎంకు ఏడోవేతన సంఘం సిఫారసులు

● 27.5 శాతం వేతనం పెంపు ● వారంలో ఐదు రోజుల పనిదినాలు

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఏడో వేతన సంఘం సిఫారసులు ఎట్టకేలకు ప్రభుత్వానికి అందాయి. రిటైర్డు ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి కె.సుధాకర్‌రావు నాయకత్వంలోని వేతన సంఘం సభ్యులు ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అధికార నివాసం కృష్ణలో శనివారం సిఫారసుల నివేదికను సమర్పించారు. ఇందులో ప్రధానంగా ఉద్యోగుల మూల వేతనాన్ని 27.5శాతం పెంచాలని సిఫారసు చేశారు. కనీస మూల వేతనం (బేసిక్‌శాలరీ) రూ.17 వేల నుంచి రూ.27వేలకు పెంచాలని ప్రతిపాదించారు. వారానికి ఐదు రోజుల పనిదినాల అంశం కూడా సిఫారసులలో చోటు చేసుకుంది. నివేదిక అందుకున్న అనంతరం సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర వేతనాన్ని ఇప్పటికే 17శాతం పెంచామని, ఈ లెక్కన మిగిలిన శాతాన్ని కూడా పెంచే అంశంపై ఆర్థికశాఖ నిపుణులతో చర్చిస్తామన్నారు. అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. వేతనసంఘం నివేదిక సమర్పించే గడవు శుక్రవారమే ముగిసినా తాను మైసూరు పర్యటనలో ఉన్న కారణంగా స్వీకరించేందుకు సాధ్యం కాలేదన్నారు. సీఎంకు నివేదిక సమర్పించిన బృందంలో సభ్యులు పీబీ రామమూర్తి, శ్రీకాంత్ వనహళ్లి, సీఎం ఆర్థికశాఖ సలహాదారుడు బసవరాజరాయరెడ్డి, సీఎం అదనపు ముఖ్యకార్యదర్శి ఎల్‌కే అతీక్, ఆర్థికశాఖ కార్యదర్శి డాక్టర్ పీసీ జాఫర్ తదితరులు ఉన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఏడోవేతన సంఘం సిఫారసులను అమలు చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందని బీజేపీ పేర్కొంది. మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై కలబురగిలో మీడియాతో మాట్లాడుతూ బీజేపీ అధికారంలో ఉన్న సమయంలో సిద్దరామయ్య ఏడోవేతన సంఘం గురించి పదేపదే వ్యాఖ్యానించేవారని, ఇప్పుడు అధికారంలో ఉన్న సిద్దరామయ్య ఏ విధంగా స్పందిస్తారో వేచి చూస్తామన్నారు.



ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

ఖర్గే కంచుకోటలో మోదీ

సమర శంఖం

● వికసిత భారత నిర్మాణమే లక్ష్యం

● ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం : మోదీ

● రాష్ట్రంలో 28 స్థానాల్లోనూ గెలిపించాలని పిలుపు

రేపు శివమొగ్గలో భారీ ర్యాలీ

ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 18న శివమొగ్గలోని ర్యాలీలోనూ ప్రసంగించనున్నారు. ప్రధాని సమక్షంలోనే డాక్టర్ సీఎన్ మంజునాథ్, మైసూరు యువరాజు యదువీర్ బీజేపీ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.



హాజరైన జనం

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కంచుకోటగా భావించే కలబురగి నుంచే ప్రధాని నరేంద్రమోదీ శనివారం తన ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరించారు. తొలుత ప్రధాని రోడ్‌షోకు పెద్దఎత్తున ప్రజలు హాజరై జేజేలు పలికారు. ఆయనపై పుష్పవృష్టి కురిపించారు. అనంతరం జరిగిన బహిరంగసభలోనూ ప్రధాని మోదీ ఉత్సాహంగా ప్రసంగించారు. కాంగ్రెస్ అవినీతి రాజకీయాలను తూర్పారబట్టారు. గత పదేళ్ల పాలనలో తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను ప్రజల ముందు ఉంచారు. వీటిలో ఆర్టికల్ 370 రద్దు, జీఎస్టీ అమలు, నారిశక్తి వందనా చట్టాలు, నూతన పార్లమెంటు గురించి వివరించారు. వికసిత భారత నిర్మాణమే తమ తదుపరి లక్ష్యమన్నారు. ఈ సాధనకోసం మొత్తం 28 నియోజకవర్గాల్లోనూ ప్రచండ విజయం అందించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేతలు ఎన్ని రకాలుగా దుస్తులు మార్చినా వారి మూలస్వభావం మారదన్నారు. అతి తక్కువ సమయంలోనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని, శాంతిభద్రతలు దిగజారాయని ఆరోపించారు. అన్ని చోట్ల ప్రజల ఆగ్రహం వెల్లువెత్తుతోందన్నారు. ప్రజలు నిత్యం భయంతో జీవించే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కుటుంబ రాజకీయాలు చేసేవారికే అవినీతి ఆక్సిజన్‌గా ఉందన్నారు. రెండు రోజులుగా దక్షిణభారత రాష్ట్రాల్లో పర్యటిస్తున్నానని, అన్నిచోట్లా ప్రజాభిమానం వెల్లువెత్తుతోందన్నారు. 1989 తర్వాత శ్రీనగర్‌లో జరిగిన ర్యాలీకి జనం భారీగా హాజరయ్యారని తెలిపారు. దక్షిణభారతదేశంలోని అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని సభకు లక్షలాదిమంది కార్యకర్తలు తరలిరావడంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేసింది. కాంగ్రెస్, కొన్ని కుటుంబ రాజకీయ పార్టీలకు అవినీతి ఆక్సిజన్‌గా ఉందని ప్రధాని ప్రస్తావించినప్పుడు కార్యకర్తల నుంచి కరతాళ ధ్వనులు మిన్నంటాయి. కేంద్రంలోని తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను ప్రధాని ఏకరువు పెట్టారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర మాట్లాడుతూ మోదీ ప్రజాసంక్షేమానికి ప్రజలు ఫిదా అవుతున్నారని, రాష్ట్రంలోని మొత్తం 28 లోక్‌సభ నియోజకవర్గాలను క్లీన్‌స్వీప్ చేస్తామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రపంచం మొత్తం మోదీవైపే చూస్తోందన్నారు. ప్రధాని తన ప్రసంగంలో ఎలక్టోరల్ బాండ్ల అంశంగానీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలపైగానీ ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం గమనార్హం. మాజీ ముఖ్యమంత్రులు బీఎస్ యడియూరప్ప, బసవరాజ్ బొమ్మైతోపాటు కేంద్రమంత్రులు ప్రహ్లాద్‌జోషి, భగవంత్ ఖూబా, బీజేపీ నేతలంతా పాల్గొన్నారు.

కలబురగి బహిరంగ సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,583.00	1,596.95
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,129	9,347
సామర్థ్యం (టీఎంసీలు)	6.09	17.83

బళ్లారి-సొల్లాపుర బస్సు సర్వీసు ప్రారంభం



ప్రారంభమైన నాన్ ఏసీ స్లీపర్ కోచ్

బళ్లారి సిటీ, మార్చి 16: బళ్లారి సొల్లాపుర(మహారాష్ట్ర)మధ్య నూతనంగా నాన్ ఏసీ స్లీపర్ కోచ్ బస్సు సర్వీస్ ప్రారంభించినట్లు కల్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ బళ్లారి విభాగం అధికారి ఇనాయత్ బాగ్‌బాన్ తెలిపారు. బస్సు బళ్లారి నుంచి హొసపేట, విజయపుర మీదుగా వెళ్తుందన్నారు. బళ్లారిలో రాత్రి 9-30గంటలకు బయలుదేరి హొసపేట రాత్రి 11గంటలకు, సొల్లాపురకు ఉదయం 5-30గంటలకు చేరుకుంటుందన్నారు. సొల్లాపురలో రాత్రి 8-48గంటలకు బయలుదేరి హొసపేటకు ఉదయం 3-30గంటలకు బళ్లారికి ఉదయం 4-45కు చేరుకుంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా టికెట్లు తీసుకోవచ్చునన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి సిటీ, మార్చి 16: కర్ణాటక మహర్షి వాల్మీకి గిరిజన అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతీ యువకుల నుంచి నైపుణ్య శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కర్ణాటక వాల్మీకి మహర్షి గిరిజన అభివృద్ధి మండలి జిల్లావ్యవస్థాపకులు ఒకప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 28వ తేది లోపల దరఖాస్తులను సమర్పించాలని కోరారు. 60రోజుల పాటు టైలరింగ్, 30రోజుల పాటు బోటిక్ నిర్వహణ, డేటా ఎంట్రీ ఆపరేషన్, సౌరఫలక స్థాపక, వస్త్రవిన్యాసం, తదితర వాటిపై శిక్షణ ఉంటున్నట్లు తెలిపారు.

గ్రామంలో ఎలుగుబంటి ప్రత్యక్షం



గ్రామ నడి రోడ్డులో తిరుగుతున్న ఎలుగుబంటి

బళ్లారి సిటీ,మార్చి 16: విజయనగరం జిల్లా హగరి బొమ్మనహళ్లి తాలూకా కొత్త ఆనందేవనహళ్లి దాబా సమీపంలో శుక్రవారం రాత్రి ఎ లుగుబంటి కనిపించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. అది ఊరిబయట బావిలో నీళ్ళు తాగేందుకు తరచూ వస్తుండేదని, అయితే ఇప్పుడు ఒక్కసారిగా గ్రామంలోకి రావడం చూసి గ్రామస్థులు అవాక్కయ్యారు. అనేకల్లు అటవీ ప్రాంతంలోని గుడ్డతిమ్మప్ప దేవాలయం సమీపంలో దీనిని చూసినట్లు డిప్యూటీ మండల అటవీ అధికారి కరిబసప్ప తెలిపారు. అటవీ ప్రాంతంలో తాగునీరు లేకపోవడంతో జంతువులు గ్రామ, పట్టణాల నడిబొడ్డుకు చేరుతున్నాయని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు.

వ్యాపార పటిష్టతపై జాతీయ సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

బళ్లారి సిటీ, మార్చి 16: విజయనగరం శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ, జ్ఞానసాగర్ క్యాంపస్ హాల్లో శనివారం వ్యాపార పటిష్టతపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లావాణిజ్య పారిశ్రామిక సంస్థ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు వ్యాపార విలువల గురించి తెలిపారు. బళ్లారిలోని విజయనగర శ్రీకృష్ణదేవరాయ ఉపకులపతి ప్రొఫెసర్ కేఎం. మేత్రి, రిజిస్ట్రార్ రుద్రేశ్, సామాజిక, పారిశ్రామికవేత్తలు ఆనంద్‌బాబు, డా.జిలాన్‌భాష తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

హొసపేట మార్చి 16: హొస్పేట ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిని జిల్లాకలెక్టర్ ఎంఎస్.దివాకర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల వారీగా చిన్నారుల ఆరోగ్యంపై ఆరా తీసి ఆసుపత్రి సేవలపై సమాచారం తెలుసుకున్నారు. పిల్లల వైద్యులు, గైనకాలజిస్టులను సంప్రదించారు. సెక్యూరిటీ గార్డు నియామకానికి అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని, నెలకు 500పైగా ప్రసవాలు జరిగేలా సౌకర్యాలను పెంచాలన్నారు.

బళ్లారి, రాయచూరు స్థానాలకు రెండో విడతలో ఎన్నిక

మే 7న పోలింగ్

బళ్లారి, రాయచూరు, మార్చి 16 : కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన లోకసభ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం బళ్లారి, రాయచూరు స్థానాలకు మే 7న పోలింగ్ నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 28 లోకసభ స్థానాలకు గాను 14 స్థానాలకు తొలి విడత ఏప్రిల్ 26న పోలింగ్ నిర్వహించనుండగా, రెండవ విడతగా మరో 14 స్థానాలకు మే 7న ఓటింగ్ నిర్వహించనున్నారు. రెండవ విడతలో రాయచూరు, బళ్లారితో పాటు ఉమ్మడి జిల్లాలో భాగంగా ఉన్న కొప్పళ లోకసభ నియోజక వర్గానికి కూడా అదే రోజు పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఏప్రిల్ 12న జారీ కానుంది. నామినేషన్‌లు సమర్పించేందుకు ఏప్రిల్ 19 చివరితేదీగా ఉంటుంది. మరుసటి రోజు వీటిని పరిశీలిస్తారు. నామినేషన్‌ల ఉపసంహరణకు ఏప్రిల్ 22వరకు గడువు ఉంటుంది. మే 7న పోలింగ్ జరుగుతుంది. ఫలితాల కోసం జూన్ 4వరకు ఎదురుచూడాల్సి ఉంటుంది. కాగా ఇప్పటికే బళ్లారి, కొప్పళ స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించిన విషయం విదితమే.



బళ్లారిలో 18.52లక్షల మంది ఓటర్లు

బళ్ళారి, వియజనగర ఉభయ జిల్లాలు చేరి 18.52లక్షల మంది ఓటర్లు ఉన్నారు. బళ్ళారి జిల్లా వ్యాప్తంగా నాలుగు శాసనసభ నియోజకవర్గాలు, విజయనగర జిల్లా పరిధిలో నాలుగు శాసనసభ నియోజకవర్గాలు చేరి మొత్తం 8 నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో విడుదలైన ఓటరు జాబితాలో 1,972 పోలింగ్ కేంద్రాల పరిధిలో 18,52,133 ఓటర్లు వస్తారు. ఇందులో 9,37215 మహిళా ఓటర్లు ఉండగా, 9,14,652 మంది పురుష ఓటర్లు ఉన్నారు. ఈ సారి మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు.

జిల్లా యంత్రాంగం చర్యలు

జిల్లాలో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా కొనసాగేందుకు, పోలింగ్ శాతం పెంచేందుకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, స్వీప్ సమితి, డోల్ అధికారులు జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాహుల్ శరణప్ప సంకనూరు నేతృత్వంలో ఇప్పటికే అధికారుల సమావేశాలు నిర్వహించారు. ఓటర్లలో జాగృతి కార్యక్రమాలు నిర్వహించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఇప్పటికే 23 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా ఫ్లెక్స్‌లు, బ్యానర్లు ముద్రించరాదని ఇప్పటికే ప్రింటింగ్ ప్రెస్‌లకు ఆదేశాలు జారీ చేశారు. అభ్యర్థుల ఖర్చు, బ్యాంకుల లావాదేవీలపై నిఘా వహించేలా అధికారులకు, ఎన్నికల అధికారులకు సూచనలు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలి

కంప్లి, మార్చి 16 : మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని జిల్లా కుటుంబ నియంత్రణ అధికారి డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. కుడితిని పట్టణంలో ఫోరమ్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ



మహిళా దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన అధికారిణి విజయలక్ష్మి

కార్యక్రమాన్ని వాల్మీకి భవనంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మాట్లాడారు. వాల్మీకి భవనం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీశక్తి సంఘాలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినట్లయితే మరలా రుణాలు పొందవచ్చునన్నారు. తీసుకున్న రుణాల వల్ల కుటుంబం ఆర్థికంగా మెరుగుపడాలన్నారు. అలాగే గ్రామాల్లో బాల్య వివాహాలు చేపట్టవద్దని, బాల్య వివాహాల వల్ల గర్భస్రావం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. మహిళలు స్వశక్తితో తమ వృత్తి ద్వారా ముందడుగు వేయాలన్నారు. సంఘ సంస్థలు ఇచ్చిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వేణివీరాపురం, సిద్దమ్మనహళ్లి, కుడితిని గ్రామాల్లోని స్త్రీశక్తి మహిళలు గత 12 సంవత్సరాలుగా ఈ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ ఇచ్చిన రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సుమారు 350 మందికి పైగా మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లావణ్య, లక్ష్మమ్మ, శైలజ, జ్యోతి, నీరజమ్మ, రాజేశ్వరి, సుంకమ్మ, నాగరత్న, వెంకటేష్, హారతి తదితరులు పాల్గొన్నారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి.. భారీగా వాహనాల స్వాధీనం

బళ్లారి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బళ్లారి రూరల్ పిడిహళ్ళి పోలీసు స్టేషన్ పరిధిలో కొండయ్య ఫ్యాక్టరీ వద్ద కంప చెట్లలో పేకాట స్థావరంపై శనివారం సాయంత్రం బళ్లారి రూరల్ పోలీసులు ముప్పేట దాడి నిర్వహించారు. సిరుగుప్ప డిఎస్పీ తెలిపిన వివరాల మేరకు గత కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున అందర్ బాహర్ జూదం నడుస్తోంది. కర్నూలు, అనంతపురం, బళ్ళారి, హొసపేట తదితర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున జూదర్లు వచ్చి పేకాట ఆడుతున్నారు. రోజూ 30 నుండి 40లక్షలు చేతులు మారుతోంది. ఈ విషయం తెలిసిన పోలీసులు శనివారం సాయంత్రం సిరుగుప్ప డిఎస్పీ నేతృత్వంలో సుమారు 30మంది పోలీసులు అనేక బ్యాచ్‌లుగా విడిపోయి కొందరు మఫ్టీలోను, కొందరు యూనిఫారమ్‌లోనూ నాలుగు దిక్కుల నుంచి జూదర్లను చుట్టుముట్టి దాడిచేశారు. వారిలో కొందరిని అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు తప్పించుకున్నారు. 40 ద్విచక్ర వాహనాలు, రెండు ఇన్నోవా వాహనాలు, రెండు, మూడు బొలెరా వ్యాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. అయితే నగదు ఎంత స్వాధీనం చేసుకున్నది పోలీసులు వెల్లడించలేదు. ఈ విషయంపై పిడి హళ్ళి పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు సిరుగుప్ప డిఎస్పీ తెలిపారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



జూదర్ల నుండి స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

మీడియా సహకారంతోనే అందరికీ ఆరోగ్యం: డీహెచ్‌ఓ

బళ్లారి గాంధీనగర్, మార్చి 16: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ చేపడుతున్న కార్యక్రమాల గురించి ప్రజల వద్దకు తీసుకెళ్ళడంలో మీడియా పాత్ర ప్రముఖమైనదని జిల్లా కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేష్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య అభియాన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలోని డిఎన్‌బి హాల్‌లో మీడియా ప్రతినిధులకు ఒక రోజు సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే నేపథ్యంలో జిల్లా ఆరోగ్య శాఖ ఉత్తమ సేవలు అందిస్తూ వస్తోందన్నారు. అంటురోగాల నియంత్రణకు తనదైన రీతిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రసూతి కేసులు జిల్లా ఆసుపత్రి, విమ్స్ ఆసుపత్రిలో ఎక్కువగా జరుగుతున్నాయని, మాతా శిశు మరణాలను నియంత్రించడానికి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్లుకోమా, మానసిక ఆరోగ్య క్షయరోగ నిర్మూలన, హెచ్ఐవిలతో పాటు ఇతర కార్యక్రమాల గురించి వైద్యాధికారులు మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా సర్జన్ డాక్టర్ బసరెడ్డితో పాటు ఆర్‌సిహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప, జిల్లా కుటుంబ సంక్షేమ శాఖ కార్యక్రమాల నిర్వహణ అధికారి డాక్టర్ పూర్ణిమా కట్టిమని, జిల్లా కుష్టువ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ వీరేంద్ర కుమార్, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్.అబ్దుల్లా, జిల్లా క్షయ రోగ నిర్మూలనాధికారి డాక్టర్ ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీహెచ్‌ఓ రమేష్ బాబు

ఏపీఎంసీ మార్కెట్ పదాధికారుల నియామకం

కంప్లి, మార్చి 16 : కంప్లి ఏపీఎంసీ మార్కెట్ పదాధికారుల నియామకం జరిగింది. అధ్యక్షులుగా దేవలాపురం అంజినప్ప, ఉపాధ్యక్షులుగా ఇటిగి శరణబసవలు ఎన్నికయ్యారు. వారితో పాటు దొడ్డ యర్రిస్వామి, పంపాపతి, సురేష్ బాబు, క్రిష్ణ, మల్లమ్మ, సురేష్‌రెడ్డి, హబీబ్ రెహ్మాన్, గురుమూర్తి, ఖాసీమ్ సాబ్, చెన్నబసవ, తిప్పయ్య, యల్లమ్మ కమిటీసభ్యులుగా నియామకమయ్యారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన అంజినప్ప, శరణ బసవలను ఎమ్మెల్యే జేఎన్ గణేష్ అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తమ తండ్రి సమయంలో అంజినప్ప గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ గెలుపుకు తమ తండ్రికి ఎంతో సహకారం అందించారన్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించి మరలా ఆయనను అధ్యక్షులుగా ఎన్నుకున్నామన్నారు ఏపీఎంసీ ఇప్పటికే సొంత మార్కెట్‌గా ఏర్పడిందని, రైతులకు అనుగుణంగా రాబోయే కాలంలో అభివృద్ధి చేపట్టి ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దుదామని తెలిపారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

కనకదుర్గమ్మ హుండీ లెక్కింపు

రూ.36,25,412 ఆదాయం వచ్చినట్టు ఈఓ వెల్లడి



హుండీ కానుకల లెక్కింపులో నిమగ్నులైన భక్తులు

బళ్లారి సిటీ, మార్చి 16: బళ్లారి ప్రజల ఆరాధ్యదైవమైన కనకదుర్గమ్మ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఈ లెక్కింపులో గత సంవత్సరం డిసెంబరు 23 నుంచి శనివారం వరకూ హుండీ ఆదాయం రూ.36,25,412 వచ్చిందని ఈఓ హనుమంతప్ప తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏసీ గంగాధరప్ప, ప్రధాన ధర్మకర్త రామాంజినేయులు, పర్యవేక్షకురాలు భువనేశ్వరీ, ఈఓ హనుమంతప్ప, ఏఎస్ఐ శర్మాస్‌వలీ, అర్చకులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కొప్పళ బీజేపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజు ప్రచారం

సిరుగుప్ప, మార్చి 16 : మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప సమక్షంలో పార్టీ ప్రచారంలో పాల్గొంటామని కొప్పళ బీజేపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజు తెలిపారు. తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో శనివారం మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ఇంటి ఆవరణలో బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొప్పళ బీజేపీ అభ్యర్థి బసవరాజు పాల్గొని కార్యకర్తల సహకారం కోరారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గెలుపు కోసం కార్యకర్తలు తమ వంతుగా సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షులు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, జిల్లా బీజేపీ యువ అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప, వెంకటప్ప నాయక, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో పేటే ఆంజనేయస్వామి

సిరుగుప్ప, మార్చి 16 : ఘనంగా పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సిరుగుప్ప తాలుకాలోని దేశనూరు రోడ్డుమార్గంలో వెలసిన పేటే ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్యామాచార్య ఆధ్వర్యంలో స్వామివారికి పుష్పాలంకరణ, ఆకుపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం

సిరుగుప్ప, మార్చి 16 : వస్తువులను కొనుగోలు చేయడం మనిషి హక్కు అని సిరుగుప్ప తాలుకా జడ్జి హుస్సేన్ సాబ్ తెలిపారు. సిరుగుప్ప పట్టణం నగరసభ కార్యాలయంలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఆయన మొక్కలకు నీరుపోయడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి వస్తువు దర అడిగి కొనుగోలుచేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా నగరసభ కమీషనర్ గురుప్రసాద్, సముదాయ అధికారి అమరేష, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, వినియోగదారులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రాఘవేంద్రస్వామి పట్టాభిషేకం



పురవీధుల్లో సాగుతున్న రాఘవేంద్రస్వామి రథోత్సవం

సిరుగుప్ప, మార్చి 16 : సిరుగుప్ప పట్టణంలో వేణుగోపాలస్వామి ఆలయంలో వెలసిన రాఘవేంద్ర స్వామి పట్టాభిషేక మహోత్సవాలు శనివారం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన రథాన్ని పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బ్రాహ్మణుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, మధ్వబ్రాహ్మణులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నూతన గ్రామ పంచాయతీ కార్యాలయానికి భూమిపూజ

బళ్లారిరూరల్, మార్చి 16 : బళ్లారి తాలుకా పీడీహళ్లి గ్రామంలో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి శనివారం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీ నారాయణప్ప, తాలుకా ఈవో మడిగిన బసప్ప భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యులు రమాదేవి, రామన్న, బ్రహ్మానందం, లక్ష్మీ, శివరాజ్, నారాయణప్ప, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న దృశ్యం

హొసూరు జోన్

వన్యప్రాణుల కోసం నీటి తొట్ల ఏర్పాట్లు



భారీ తొట్టెలలో నీరు నింపుతున్న అధికారులు

హొసూరు, మార్చి 16: వేసవి ప్రారంభం కావడంతో ఎటు చూసినా నీటి ఎద్దడి నెలకొంది. దీని ప్రభావం కారణంగా అడవుల్లోని వన్యప్రాణులు సైతం నీటికోసం తహతహలాడుతున్నాయి. పలుచోట్ల భూగర్భజలాలు అడుగంటాయి. అడవులలో వన్యప్రాణుల సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో భారీ నీటి తొట్టెలను ఇప్పటికే నిర్మించారు. ప్రస్తుతం అటవీశాఖ అధికారులు ఈ తొట్టెలలో ట్యాంకర్ల ద్వారా నీరు నింపే కార్యక్రమాన్ని చేపట్టారు. తళి సమీపాన జవలగిరి, శూలగిరి ప్రాంతాల్లో పనులు చేపట్టామని అటవీశాఖ అధికారి కార్తికేయని తెలిపారు. ఈ ప్రాంతాల్లో నిఘా కోసం కొన్ని చోట్ల కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలు

రాయచూరు, మార్చి 16 : రాయచూరు-హైదరాబాద్ అంతరాష్ట్ర రహదారిలో శనివారం హెగ్గసనహళ్ళి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న బైకును వేగంగా వెళుతున్న లారీ ఢీకొట్టడంతో బైక్ పై వెళుతున్న వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కాగా సమాచారం తెలుసుకున్న పోలీసులు అతడిని చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడి అర్తనాదాలు చేస్తున్న వ్యక్తిని కొద్దిసేపటి వరకు ఎవ్వరు పట్టించుకోకపోవడం గమనార్హం.

నేడు ఘంటసాల స్మారక సంగీత విభావరి

హొసూరు మార్చి 16: హొసూరు ఆంధ్రసాంస్కృతిక భవనంలో అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేకంగా స్మారక సంగీత విభావరి నిర్వహించనున్నారు. గాయనీ, గాయకులు ఎస్ టీ రాజు, మునిరాజు, నాగభూషణం, మహాలక్ష్మి, చంద్రతేజ, తదితరులు పాల్గొంటున్నారని ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో తెలుగు భాషాభిమానులు, ఘంటసాల అభిమానులు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమానులు, సంగీతాభిమానులు పాల్గొంటారన్నారు.

ప్రతి ఇంటినుంచి డీఎంకే సభ్యులు ఉండాలి

హొసూరు, మార్చి 16: డీఎంకే యువ విభాగంలో ప్రతి ఇంటినుంచి యువతను చేర్చుకునేలా కార్యాచరణ సాగుతోంది. ఇందులో భాగంగా పార్టీ పశ్చిమజిల్లా కార్యదర్శి వై ప్రకాశ్ స్థానికులకు పార్టీలో చేరేందుకు అప్లికేషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీఎంకే అధినేత, సీఎం స్టాలిన్ సూచన మేరకు ప్రతి ఇంట్లోనూ డీఎంకే సభ్యులు ఉండేలా కార్యకర్తలు చొరవ చూపాలన్నారు. జిల్లా యువత ఆర్గనైజర్ సుమాన్ నేతృత్వంలో ఏర్పాటైన కార్యక్రమంలో మేయర్ సత్య, జిల్లా ఉపకార్యదర్శి మురుగన్, కోశాధికారి సుకుమారన్, యూత్ రాష్ట్ర ఉప కార్యదర్శి శ్రీనివాసన్, నగర యూత్ ఆర్గనైజర్ కలైచెళియన్, డిప్యూటీ ఆర్గనైజర్లు ప్యాట్రిక్ ఫెర్నాండెజ్, శ్రీనివాసన్, కార్తీక్, బాలాజీ, లోకేశ్ పాల్గొన్నారు.



పార్టీ సభ్యత్వ నమోదుకు సంబంధించిన ఫారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

రాజకీయ లబ్ధికోసమే మరోసారి సీఏఏ బిల్లు



రాయచూరు అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

రాయచూరు, మార్చి 16 : లోకసభ ఎన్నికల్లో రాజకీయంగా ప్రయోజనం పొందేందుకే కేంద్ర ప్రభుత్వం మరోసారి పౌరసత్వ చట్టసవరణ బిల్లును ముందుకు తెచ్చిందని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి ఎండీ అమీర్ అలి ఆరోపించారు. సీఏఏను వ్యతిరేకిస్తూ ఆ పార్టీ శ్రేణులు శనివారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా మాట్లాడిన పార్టీ నాయకులు, 2018లో లోక్‌సభ ఆమోదించిన ఈ బిల్లు పై వివాదం నెలకొనడమే గాక దేశంలోని అనేక రాజకీయ పార్టీలు, ప్రజాస్వామికవాదులు వ్యతిరేకించిన నేపథ్యంలో బిల్లు అమలును కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు. ప్రస్తుతం లోకసభ ఎన్నికల షెడ్యూల్ వెలువడుతున్న తరుణంలో ఈ బిల్లును మళ్ళీ తెరపైకి తేవడం ద్వారా ఓట్లు దండుకునే కుతంత్రానికి కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాల్పడ్డాయని ఆరోపించారు. బిల్లును ఉపసంహరించుకోవాలని లేదంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రంలో జేడీఎస్-బీజేపీ కూటమికే అధిక స్థానాలు

రాయచూరు, మార్చి 16 : దేశం, సమగ్రాభివృద్ధి కోసం లోకసభ ఎన్నికల్లో జేడీఎస్-బీజేపీలు కలిసి పని చేసేందుకు నిర్ణయించాయని మాజీ ఎమ్మెల్యే రాజావెంకటప్ప నాయక్ అన్నారు. రెండు పార్టీల కూటమికి లోకసభ ఎన్నికల్లో ఘన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెండు పార్టీల తరఫున కూటమి విజయం కోసం పని చేయాలంటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఉద్బోధించారు. ఇందుకు సంబంధించి పార్టీ తరఫున చేపట్టే ప్రచార పోస్టర్‌లను శనివారం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో విడుదల చేశారు. మిగిలిన 8 స్థానాల్లో జేడీఎస్ పోటీ చేస్తుందని త్వరలోనే పార్టీ అభ్యర్థుల పేర్లు వెల్లడవుతాయన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజావెంకటప్ప నాయక్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

డాక్టర్ డీవీ గుండప్ప (జయంతి)



డీవీజీగా చిరపరిచితులైన 'పద్మభూషణ్' గ్రహీత డాక్టర్ దేవనహళ్ళి వెంకట రమణయ్య (డీవీ) గుండప్ప 1887 మార్చి 17న మైసూరులో జన్మించారు. కన్నడ కవి, రచయిత, తత్వవేత్త. ఆయన రచించిన 'మంకుతిమ్మన కగ్గ' ఎంతో పేరొందింది. 1906-07లో భారత్, కర్ణాటక అనే కన్నడపత్రికలను ప్రారంభించారు. 'సుమతి' వారపత్రిక నడిపారు. 'ది కర్ణాటక' అనే ఆంగ్ల పత్రికను 'దివాన్' విశ్వేశ్వరయ్య సహకారంతో ప్రచురించారు. సాహిత్య అకాడమీ పురస్కారం, ఇతర అవార్డులు పొందారు. 1975 అక్టోబరు 7న కన్నుమూశారు.

పుతిన (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత పురోహిత తిరునారాయణ నరసింహాచార్ (పుతిన) 1905 మార్చి 17న కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లా మేలుకోటెలో జన్మించారు. కన్నడ ప్రఖ్యాత విద్వాంసుడు, సాహితీవేత్త. కువెంపు, బేంద్రె, పుతినలను కన్నడ నవోద్యమ కవులుగా వ్యవహరిస్తుంటారు. ఆయన రాసిన గీత నాటకాలు ఎంతో పేరొందాయి. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, పంప పురస్కారం, నాడోజా, రాజ్యోత్సవ తదితర అవార్డులు పొందారు. 1998 అక్టోబరు 23న కన్నుమూశారు.

కల్పనాచావ్లా (జయంతి)




కల్పనా చావ్లా 1962 మార్చి 17న హరియాణ రాష్ట్రం కర్నాల్ పట్టణంలో జన్మించారు. ఇండో-అమెరికన్ వ్యోమగామి, ఇంజనీర్. 1997లో కల్పనా చావ్లా అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించారు. 376 గంటలపాటు అంతరిక్షంలో గడిపారు. ప్రైమరీ రోబోటిక్ ఆర్మ్ ఆపరేటర్, మిషన్ స్పెషలిస్ట్. 2003 ఫిబ్రవరి 1న కన్నుమూశారు. మరణానంతరం ఆమె జ్ఞాపకార్థం పలు గౌరవాలు ప్రకటించారు. 2003 ఫిబ్రవరి 3న అప్పటి ప్రధాని వాజ్‌పేయ్ కొన్ని శాటిలైట్స్‌కు కల్పనా పేరు పెట్టారు.

పునీత్‌రాజ్‌కుమార్ (జయంతి)



కన్నడ నటుడు పునీత్ రాజ్‌కుమార్ 1975 మార్చి 17న జన్మించారు. కన్నడ కంఠీరవుడు డాక్టర్ రాజ్‌కుమార్ తనయుడు. ముద్దుపేరు అప్పు. కన్నడనాట అత్యధిక పారితోషికం అందుకున్న నటులలో ఒకరు. బాల నటుడి నుంచి హీరోగా ఎదిగారు. పాటలు పాడడమే కాక నిర్మాతగాను రాణించారు. బుల్లితెరపైనా సత్తా చాటుకున్నారు. నేషనల్ ఫిల్మ్ అవార్డుతోపాటు పలు పురస్కారాలు అందుకున్నారు. అనేక ఉత్పత్తులకు రాయబారిగా వ్యవహరించారు. 46వ యేట 2021 అక్టోబరు 29న కన్నుమూశారు. ఆయన సినీ, సమాజ సేవలను గుర్తిస్తూ మరణానంతరం 'కర్ణాటక రత్న' గౌరవాన్ని ప్రభుత్వం ప్రకటించింది.

సత్తిరాజు సీతారామయ్య (వర్ధంతి)



ప్రముఖ పాత్రికేయుడు, రచయిత, సామాజికవాది సత్తిరాజు సీతారామయ్య 1864 డిసెంబరు 11న పశ్చిమ గోదావరి జిల్లాలో ఇరగవరం మండలం కంతేరు గ్రామంలో జన్మించారు. 1893లో 'దేశోపకారి' పత్రికను, 1902లో 'హిందూసుందరి' మాస పత్రికను ప్రారంభించారు. న్యాయవాదిగా కెరీర్ ఆరంభించి పత్రికలకోసం వృత్తిని వదిలేశారు. ఏలూరు మునిసిపల్ కౌన్సిలర్‌గా, కంతేరు గ్రామపంచాయతీ అధ్యక్షుడిగా, తాలూకా బోర్డు సభ్యుడిగా పలు హోదాలలో సేవలందించారు. పలు తాళపత్ర గ్రంథాలను, శాసనాలను, వ్రాతప్రతులను సేకరించి మద్రాసు మ్యూజియంకు ఇచ్చారు. ఆయన దివంగత బాపు తాతగారి పెద్ద సోదరుడు. 1945 మార్చి 17న కన్నుమూశారు.

సైనా నెహ్వాల్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత సైనా నెహ్వాల్ 1990 మార్చి 17న హరియాణ రాష్ట్రం హిస్సార్‌లో జన్మించారు. దేశంలో పేరొందిన తొలి మహిళా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి. 2015లో వరల్డ్‌నెంబర్ 1 ర్యాంకింగ్‌లో నిలిచారు. కామనెల్త్‌లో సింగిల్స్‌లో రెండు సార్లు బంగారుపతకం సాధించారు. 24కుపైగా ఇంటర్నేషనల్ టైటిల్స్ సాధించారు. ఒలింపిక్స్‌లో భారతదేశం తరఫున మూడుసార్లు ప్రాతినిధ్యం వహించగా రెండోసారి కాంస్యపతకం సాధించారు. బ్యాడ్మింటన్‌లో పలు మైలురాళ్లు నెలకొల్పారు. 2023 సీజన్‌లో ఫలితాలలో ప్రపంచంలో 26వ నెంబరుకు చేరారు. రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున అవార్డు తదితర అవార్డులు సాధించారు. అంతేకాక సమాజసేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉన్నారు.

నెమలి వాహనంపై చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ,మార్చి16: పట్టణంలోని గవిమఠంలో వెలసిన చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మూడవరోజు స్వామి వారు నెమలి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని మఠం నుంచి మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి నెమలి వాహనంపై కొలువుదీర్చారు. గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంట్ రాజన్నగౌడ్, గవిమఠం సిబ్బంది నారాయణస్వామి, మధు, వెంటేశులు, రఘు, వీరశైవసంఘం నాయకులు, వీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేడు అడ్డపల్లకి ఉత్సవం

చంద్రమౌళీశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అడ్డపల్లకి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. స్థానిక వెలిగొండ రహదారిలో విడిది మఠం నుంచి పీఠాధిపతిని అడ్డపల్లకిపై వీధుల గుండా ఊరేగిస్తారు. ఈ ఉత్సవాన్ని వడ్డెర్ల సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీ.

ఘనంగా వెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం



పురవీధులలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహదేవపుర, మార్చి 16: నియోజకవర్గంలోని ఇమ్మడిహళ్ళిలో కొలువైన ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం శనివారం భక్తి శ్రద్ధలతో భక్తుల గోవిందనామస్మరణ మధ్య జరిగింది. శ్రీకంఠేశ్వర, పంచముఖి ఆంజనేయ స్వామి, ద్రౌపదమ్మ ఆలయాలలోనూ విశేషపూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మంజుళాతో కలసి మాజీ మంత్రి అరవింద లింబావళి పాల్గొన్నారు. రథోత్సవంలో భాగంగా తొలుత స్వామివారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. హగదూరు, వైట్‌ఫీల్డ్, చన్నసంద్ర, వర్తూరు, గుంజూరు, హూడి, నల్లూరహళ్ళి, నాగొండనహళ్ళి, కాడుగూడి తదితర ప్రాంతాలకు చెందిన వేలాదిమందిభక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులయ్యారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. వీరగాసె, డొళ్ళుకుణిత, తమటె, పూజాకుణిత, నాదస్వర, మైసూరు నగారి, నందిధ్వజ, కీలుగుర్రాలు, గారడీ బొమ్మలు తదితర కళాబృందాలు సందడి చేశాయి. ఉత్సవాల్లో నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు నటరాజ్, మనోహర్‌రెడ్డి, ప్రముఖులు ఎల్ రాజేశ్, శ్రీధర్, శ్రీధర్‌రెడ్డి, హూడిపిళ్ళప్ప, మధు తదితరులు పాల్గొన్నారు.



ప్రసన్న వెంకటరమణస్వామికి పూజలు

రాఘవేంద్రస్వామికి లక్ష పుష్పార్చన

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు జయనగర్ 5వ బ్లాక్‌లోని నంజనగూడు రాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రస్వామి జయంతిలో భాగంగా బృందావనానికి ఉడుపి పెజావర మఠం విశ్వప్రసన్నతీర్థస్వామిజీ నేతృత్వంలో లక్ష పుష్పార్చన ఘనంగా జరిగింది. రాఘవేంద్రమఠం ముఖ్యులు సుబుధేంద్ర తీర్థ స్వామిజీ సూచనతో మఠం సీనియర్ మేనేజర్ ఆర్‌కే వాదీంద్రాచార్, గుండాచార్య నేతృత్వంలో పూజలు సాగాయి. తొలుత విశ్వప్రసన్నతీర్థ స్వామిజీకి పూర్ణకుంభ స్వాగతం లభించింది. విద్వాంసులు బండి శామాచార్య సంపాదకత్వంలో సిద్ధమైన ప్రసన్న వచనం ధ్యాయేత్ పుస్తకాన్ని లాంఛనంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్వాన్ బండి శామాచార్య, విద్వాన్ అగ్నిహోత్రి వేణుగోపాలాచార్య, ఎమ్మెల్యే సీకే రామమూర్తి, సినీ నటి ప్రేమా తదితరులు పాల్గొన్నారు.



విశేషపూజల్లో విశ్వప్రసన్నతీర్థస్వామిజీ

అకాడమీలకు నూతన అధ్యక్షుల నియామకం

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కన్నడ సాంస్కృతిక శాఖ నిర్వహణలోని పలు అకాడమీలకు నూతన అధ్యక్షులు, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. అకాడమీ అధ్యక్షుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

1. డా.పురుషోత్తమ బిళిమలె - కన్నడ అభివృద్ధి ప్రాధికార
2. డా.చన్నప్ప కట్టి - కువెంపు భాషా భారతి ప్రాధికార
3. మానస- కన్నడ పుస్తక ప్రాధికార
4. అశోక్ చందరగి- కర్ణాటక సరిహద్దు ప్రాధికార
5. డా.ఎల్ఎస్. ముకుందరాజ్ - కర్ణాటక సాహిత్య అకాడమీ
6. కె.వి.నాగరాజమూర్తి - కర్ణాటక నాటక అకాడమీ
7. డా.కృపా ఫడకె - కర్ణాటక సంగీత, నృత్య అకాడమీ
8. డా.ఎంసి.రమేష్- కర్ణాటక శిల్పకళా అకాడమీ
9. డా.పి.సి.కుమార్ - కర్ణాటక లలిత కళా అకాడమీ
10. తల్లూరు శివరామ శెట్టి - కర్ణాటక యక్షగాన అకాడమీ
11. శివప్రసాద్ గొల్లహళ్ళి - కర్ణాటక జానపద అకాడమీ
12. తారానాథ్ గట్టి కాపీకాడ్ - కర్ణాటక తుళు సాహిత్య అకాడమీ
13. జోకిం స్టాన్లీ అల్వారీస్ - కర్ణాటక కొంకణి సాహిత్య అకాడమీ
14. ఉమర్ యు.హెచ్ - కర్ణాటక బ్యారీ సాహిత్య అకాడమీ
15. సదానంద మావజి- కర్ణాటక సంచార భాష సంస్కృతులు సాహిత్య అకాడమీ
16. ప్రొఫెసర్ దుర్గా దాస్ - కర్ణాటక బయలాట అకాడమీ
17. డా. ఎఆర్.గోవింద స్వామి - కర్ణాటక బంజార అకాడమీ
18. డా. రామకృష్ణయ్య - రంగ సమాజ
19. అజ్జిన కొండ మహేశ నాచ్చయ్య - కర్ణాటక కొడవ సాహిత్య అకాడమీ

బెంగళూరు గ్రామీణకు డీకే సురేశ్ సేవలు శూన్యం : బీఎస్పీ




మీడియాతో మాట్లాడుతున్న బీఎస్పీ అభ్యర్థి చిన్నప్ప వై చిక్కహగడె తదితరులు

దొమ్మసంద్ర, మార్చి 16: బెంగళూరు గ్రామీణ లోక్‌సభ నియోజకవర్గానికి ఎంపీ డీకే సురేశ్ చేసిన సేవలు శూన్యమని గ్రామపంచాయతీ సభ్యుల మాదిరిగా డ్రైనేజీల పనులకు భూమిపూజ చేయడం ఆయన సాధన అని బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ చిన్నప్ప వై చిక్కహగడె ఆరోపించారు. సర్జాపురలో శనివారం బీఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. డీకే సురేశ్ వరుసగా బెంగళూరు గ్రామీణ నుంచి ప్రాతినిధ్యం వహించారని ఎటువంటి శాశ్వత పథకాలు తేలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ ప్రభుత్వాలు అవినీతిలో మునిగాయని ఆరోపించారు. బీఎస్పీ జాతీయస్థాయి గుర్తింపు పొందినా ఎటువంటి ఎన్నికల బాండ్‌లను పొందలేదన్నారు. బీఎస్పీకి జాతీయస్థాయిలో 12మంది లోక్‌సభ సభ్యులు, ఒక రాజ్యసభ సభ్యుడు ఉన్నా జాతీయ, రాష్ట్ర మీడియాలలో పార్టీ పేరు, చిహ్నం చెప్పేందుకు తారతమ్యం చూపుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో బెంగళూరు నగర జిల్లా ప్రధాన కార్యదర్శి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించడం ద్వారా మాయావతిని ప్రధాని చేయాలని కోరారు. బీఎస్పీ బెంగళూరు నగర జిల్లా ఇన్‌చార్జ్ గౌరిశంకర్, జిల్లాధ్యక్షుడు సీఎల్ మునియల్లప్ప, ఉపాధ్యక్షురాలు ఏ గాయత్రి, కార్యదర్శి లోకేశ్, డాక్టర్ తౌసిఫ్ అహ్మద్, తాలూకా ఇన్‌చార్జ్ బుల్లెట్ కృష్ణప్ప, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

శిడ్లఘట్ట, మార్చి 16: చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల పలు సమస్యలు, వేధింపులకు గురవుతున్నారని దీనినుంచి తప్పించుకోవడానికి తరచుగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి యమనప్పకరె హనుమంతప్ప తెలిపారు. పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో తాలూకా న్యాయసేవల సమితి, స్త్రీ శిశుసంక్షేమ అభివృద్ధిశాఖ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని చట్టంపై జాగృతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. పిల్లలు, మహిళలు ఎవరైనా దౌర్జన్యాలకు గురైతే ధైర్యంగా ముందుకొచ్చి న్యాయసేవలు పొందాలన్నారు. పిల్లలు, మహిళల కోసం పలు చట్టాలు ఉన్నాయన్నారు. ఎవరైనా అన్యాయానికి గురైనట్టు గుర్తిస్తే న్యాయసేవలు అందిస్తామన్నారు. తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఏ నారాయణస్వామి మాట్లాడుతూ బాల్య వివాహాలు, పిల్లల తరలింపు, బాలికలపై దౌర్జన్యం వంటి వాటికి చట్టరీత్యా శిక్షలు ఉన్నాయన్నారు. సమాజంలో మహిళలపై దౌర్జన్యాలను అరికట్టడమే లక్ష్యమన్నారు. మహిళలు తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన అంగన్‌వాడీ కార్యకర్తలను ఆత్మీయంగా సత్కరించారు. గర్భిణీలకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సివిల్ న్యాయాధికారి పూజ, న్యాయవాదుల సంఘం కార్యదర్శి సీజీ భాస్కర్, న్యాయవాది ఎంటీ లోకేశ్, స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి నౌతాజ్, సహాయక అధికారి లక్ష్మీదేవమ్మ, పోషణ్ అభియాన సంయోజకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో సామూహిక సీమంతం

బాలికాసంరక్షణ జాగృతికి అవేక్ శ్రీకారం



పోస్టర్ల విడుదల

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సేవ్ చైల్డ్ గర్ల్ అభియానకు అవేక్ సంస్థ శనివారం శ్రీకారం చుట్టింది. చిత్రకళాపరిషత్‌లో జరుగుతున్న మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో భాగంగా ఈమేరకు జాగృతి పోస్టర్‌లను విడుదల చేశారు. రాష్ట్ర వాణిజ్య పరిశ్రమలశాఖ, కర్ణాటక మహిళా పారిశ్రామికవేత్తల సంస్థ (అవేక్), సిడ్బి బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటైంది. స్త్రీ భ్రూణహత్యలు మహాపాతకమని వీటిపై సమాజంలో మరింత జాగృతి పెరగాలని అవేక్ సంస్థ అధ్యక్షురాలు ఎన్ఆర్ ఆశ పేర్కొన్నారు. చిత్రకళా పరిషత్‌లో ఏర్పాటైన స్వావలంబన మేళాకు అనూహ్య స్పందన లభిస్తోందని, ఈనెల 17వరకు మేళా కొనసాగుతుందన్నారు. రాష్ట్రం నలుమూలలనుంచి 75మంది మహిళా వ్యాపారుల సంఘాలు 75కుపైగా స్టాల్స్ ఏర్పాటు చేశాయన్నారు. కార్యక్రమంలో సిడ్బి బ్యాంకు సీఎండీ ఎస్ రామన్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పాఠాలను ఇష్టంతో చదవండి

బాగేపల్లి, మార్చి 16: పాఠాలైనా, పరీక్షలైనా ఇష్టంతో చదవడం ద్వారా త్వరగా అర్థం అవుతాయని ప్రగతి విద్యాసంస్థ ముఖ్యులు లలితా మిర్జా అభిప్రాయపడ్డారు. తాలూకాలోని తీమాకలపల్లి గ్రామంలోని ప్రగతి విద్యాసంస్థలో శనివారం సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా మిర్జా మాట్లాడుతూ సరస్వతి దేవిని ప్రార్థించడం ద్వారా జ్ఞానం, విద్య అనుగ్రహం సాధ్యమన్నారు. తద్వారా ఎందులోనైనా విజయం సాధించవచ్చునన్నారు. విద్య అనేది మనలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞాన సముపార్జనకు దోహదం కానుందన్నారు. పరీక్షలు సమీపిస్తుండడంతో వాటిపై దృష్టి సారించి చక్కగా చదివి ఉత్తీర్ణులు కావాలన్నారు. తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో బకార్ అలి, ప్రధానోపాధ్యాయురాలు సౌరున్నీసా, ఉపాధ్యాయులు కవిత, తేజస్విని రేష్మా, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సరస్వతి పూజలో లలితామిర్జా తదితరులు

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఐచర్ వాహనం

ఇద్దరు యువకుల మృతి

బంగారపేట, మార్చి 16: తాలూకాలోని బెంగనూరు వద్ద ద్విచక్రవాహనాన్ని ఐచర్ వాహనం ఢీ కొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం 7 గంటలకు చోటు చేసుకుంది. పట్టణంలోని సిద్దార్థనగర్‌కు చెందిన ముత్తు (26), మండ్య ప్రాంతానికి చెందిన రవి (30)లు మృతి చెందినవారిగా గుర్తించారు. ప్రైవేట్ గార్మెంట్స్‌లో పనిచేసి వాపసు వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనపై బంగారపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



మృతులు ముత్తు, రవి (ఫైల్)

31న నగరంలో గానలహరి

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతుల పరిరక్షణే ధ్యేయంగా గత దశాబ్దకాలంగా విశిష్ట సేవలందిస్తున్న కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య క్రోధినామ ఉగాదిని పురస్కరించుకుని ఈ నెల 31న గాన లహరి 2024ను నిర్వహించనుంది. సమాఖ్య చైర్మన్ డా.మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి కళ్ళే వెంకటేశ్వర శాస్త్రి నగరంలో శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కల్యాణ్‌నగర్‌లోని ఇండో ఏసియన్ అకాడమీలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ పోటీలో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి గాయకులు హాజరు కానున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. ఆసక్తిగలవారు తమ పేర్లను 8861733000 నెంబరుకు ఫోన్‌చేయాల్సి ఉంటుందని నగరంలో శనివారం విడుదలైన ప్రకటన పేర్కొంది. గానలహరిని పెద్దసంఖ్యలో సంగీతాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యువతకోసం 'మతదార ప్రభుగళు' ఉచిత ప్రదర్శన



సినిమాలో అనంతరాయప్ప

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నెలమంగలకు చెందిన ప్రముఖ న్యాయవాది అనంతరాయప్ప కథను సమర్పించి దర్శకత్వం వహిస్తుండటమే కాకుండా ఇందులో న్యాయవాది పాత్రను పోషిస్తున్నారు. గతంలో సమానతెయ కడెగె (సమానత్వం వైపు) అనే చిత్రాన్ని నిర్మించి హిట్ అందుకున్న ఆయన తాజాగా ఓటర్లను జాగృత పరిచే దిశలో మతదార ప్రభుగళు (ఓటరు దేవుళ్ళు) చిత్రాన్ని రూపొందించారు. సెన్సార్‌బోర్డుచే యు సర్టిఫికెట్ అందుకున్న ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఆసక్తి చూపితే సినిమా ఉచిత ప్రదర్శనలకు తాము సిద్ధమని అనంతరాయప్ప నగరంలో శనివారం మీడియాకు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా థియేటర్లలో ఒక రోజు ఈ సినిమాను యూనివర్సిటీలు, కళాశాలల విద్యార్థులకు ఉచితంగా ప్రదర్శించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఓటు హక్కు అనే ఆయుధాన్ని ప్రజలందరూ ప్రత్యేకించి యువత సద్వినియోగం చేసుకోవాలన్న సంకల్పంతోనే ఎంతో శ్రమకోర్చి ఈ సినిమాను నిర్మించామన్నారు. దేశప్రజలందరూ ఓటు హక్కు విషయంలో తమ బాధ్యతను గుర్తెరిగి సరైన రీతిలో వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ఈ చిత్రంలో నొణవిన కెరె రామకృష్ణయ్య, జయరాం, హనుమంతరాజు, కమ్మారు, త్రివేణి, రాజ్యలక్ష్మి తదితరులు నటించారు. సంగీతాన్ని వేణుగోపాల్ అందించారు. బెంగళూరు చుట్టు పక్కల ప్రాంతాల్లోనే కథకు అనుగుణంగా పలు లోకేషన్లలో చిత్రీకరణ జరిపామన్నారు. మాడ్రన్ ఫిలింస్ పతాంకపై నిర్మించిన ఈ సినిమా గొప్ప సందేశాత్మకంగా ఉంటుందన్నారు.

ది థియేటర్ ఆఫ్ డ్రీమ్స్ పేరిట ఫుట్‌బాల్ టోర్నీ

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ది థియేటర్ ఆఫ్ డ్రీమ్స్ పేరిట ఐదుగురు సభ్యుల ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఈనెల 23న బెంగళూరులోని కోరమంగల టర్ఫ్‌పార్క్‌లో జరగనుంది. మాంచెస్టర్ యునైటెడ్ మద్దతుతో ఐదుగురు సభ్యుల జట్టు ఈ టోర్నీని ఆడనుంది. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఫుట్‌బాల్ పోటీలు జరుగుతాయని నగరంలో శనివారం విడుదలైన ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో టైర్స్ రోడ్ టు ఓల్డ్ ట్రాఫర్డ్ నినాదంతో ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. సంస్థ మార్కెటింగ్ విభాగానికి చెందిన విక్రమ్ గర్గ్ ప్రకటన విడుదల చేశారు. బెంగళూరుతోపాటు ఢిల్లీ, పూనె, కోల్కత్తా, చెన్నై, కొచ్చిన్ నగరాల్లో కూడా ఐదుగురు సభ్యుల జట్టు పలు ఫుట్‌బాల్ టోర్నీలలో పాలుపంచుకోనుందన్నారు.



క్రీడాకారులతో నిర్వాహకులు

న్యూట్రీ సేఫ్-2ను ఆవిష్కరించిన వైగాన్

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో అపురూప ఔషధాల తయారీలో ఖ్యాతి గడించిన వైగాన్ సంస్థ తాజాగా న్యూట్రిసేఫ్ 2ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ అత్యాధునిక ఎంటరల్ ఫీడింగ్ సిస్టమ్‌ను పసిబిడ్డల కోసమే పలు విస్తృత పరిశోధనల అనంతరం రూపొందించినట్లు వైగాన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ పవన్ చౌదరి నగరంలో శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎఫ్ఐసియు ఆహార భద్రతా, సంరక్షతా ప్రమాణాలకు అనుగుణంగానే పసిపిల్లల సంరక్షణలో ఇది అత్యంత కీలక పాత్రను పోషించనుందన్నారు. రెండు దశాబ్దాలకు పైగా 40కు పైగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఇది విజయవంతమైందన్నారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో ప్రముఖ పాత్రను పోషించే న్యూట్రీ సేఫ్‌పై ప్రజల్లో విస్తృతంగా జాగృతి కల్పించే పనులకు శ్రీకారం చుట్టామన్నారు.

కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం



పుట్టస్వామిగౌడకు సన్మానం

బొమ్మనహళ్ళి, మార్చి 16: కాంగ్రెస్ పార్టీలో నిష్ఠావంత కార్యకర్తలకు సముచిత స్థానం లభిస్తుందని బీడీఏ సభ్యుడిగా నియమితులైన పుట్టస్వామిగౌడ తెలిపారు. ఐఎన్‌టీయూసీ బెంగళూరు దక్షిణ విభాగం అధ్యక్షుడు సత్యనారాయణ ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టస్వామిగౌడ సత్కారం స్వీకరించి ప్రసం గించారు. కొన్నేళ్లక్రితం ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) కార్మికవిభాగం లేదని కాలక్రమంలో ఏర్పాటై కార్యకర్తగా, వివిధ హోదాలలో రాష్ట్ర స్థాయికి చేరుకున్నానన్నారు. ఐఎన్‌టీయూసీని తాలూకా, నియోజకవర్గాలు, జిల్లా స్థాయిలో బలోపేతం చేయడం ద్వారా పార్టీ విస్తరించిందన్నారు. ఇటీవల బీడీఏ సభ్యుడిగా అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. తనవంతు కార్మికుల సంక్షేమానికి పాటుపడతానన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో బొమ్మన హళ్ళి ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఓబులేశు, శ్రీనివాస్, హనుమంతు, శేఖర్, సుబ్ర మణి, మాయికణ్ణన్, రాఘవేంద్ర, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో హ్యూమన్ ట్రాఫికింగ్ కలకలం

» మదరసాపై దాడి - 20 మంది చిన్నారుల రక్షణ

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు నగరంలో హ్యూమన్ ట్రాఫికింగ్ తీవ్ర కలకలం రేపింది. జాతీయ మానవహక్కుల రక్షణా కమిషన్ అధికారులు శుక్రవారం బెంగళూరు సంపిగెహళ్ళి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మదరసాపై దాడులు నిర్వహించి 20మంది బాలికలను సంరక్షించారు. వీరిని గల్ఫ్ దేశాలకు పంపేందుకు కుట్ర పన్నినట్టు తమ దృష్టికి వచ్చిందని ఎన్‌సీపీసీఆర్ చైర్మన్ అధ్యక్షుడు ప్రియాంక కంగున్ వెల్లడించారు. మదరసా పేరిట ఇక్కడ లైసెన్స్ లేకుండా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తమ దృష్టికి వచ్చిం దన్నారు. 20మంది బాలికలు అనాథలుగా గుర్తించామని, వీరిని గాలి, వెలుతురు లేని గదిలో బంధించారన్నారు. స్థానికంగా ఉండే ఓ మహిళ కువైట్ దేశానికి బాలికలను అడపాదడపా పంపిస్తుంటుందని తమకు సమాచారం అందిందన్నారు. అన్ని కోణాల్లోనూ సమగ్ర దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ దాడి సమయంలో సల్మా, షమీర్ అనే వారు గూండాలతో దాడికి ప్రయత్నించారని, పోలీసుల సహ కారంతో బాలికలను సంరక్షించామన్నారు. బాలికల వసతి గృహానికి అనుమతి పొంది మదరసా నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు.